రహదారులిలా...
రాకపోకలు ఎలా?


కొత్తపూసలమర్రు గ్రామం వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు


భీమవరం-పాలకొల్లు రోడ్డులో గొరగనమూడి వద్ద మరమ్మతులు చేసిన రహదారి దుస్థితి

- వాహనచోదకులకు తప్పనిపాట్లు
- మాటలకే పరిమితమవుతున్న పాలకులు

భీమవరం: కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వస్తే రోడును సుందరంగా తీర్చిదిద్దుతామంటూ ఎన్నికల్లో ప్రచారం చేసి అధికారం చేపట్టిన నాయకులు రోడ్ల నిర్మాణంలో నాణ్యతను పట్టించుకుంటున్న దాఖలాలు కన్పించడం లేదు. సంక్రాంతి నాటికి గోతులులేని రోడ్లుపై సురక్షితంగా ప్రయాణం చేయడంటూ సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించినా రోడ్ల మరమ్మతులు నత్తనడకన సాగుతున్నాయి. దీనితో గోతులు రోడ్లపై ప్రయాణంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భీమవరం నియోజకవర్గంలోని భీమవరం, వీరవాసరం మండలాల్లోని రోడ్ల మరమ్మతులకు కూటమి ప్రభుత్వం సుమారు రూ.11 కోట్ల నిధులు మంజూరు చేసింది. వీటిలో భీమవరం మండలంలోని 31 పనులకు సుమారు రూ. 10.2 కోట్లు, వీరవాసరం మండలంలోని 5 రోడ్లుకు సుమారు రూ. 98 లక్షలు మంజూరయ్యాయి. నిధులు మంజూరు చేసిన వెంటనే పనులు ప్రారంభించి సంక్రాంతి పండుగ నాటికి మరమ్మలు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించింది. ఇటీవల వర్షాలు తగ్గిన వెంటనే పనులు ప్రారంభించి ముందుగా పెద్ద గోతుల్లో తారుతో కంకరవేశారు. వాటిపైన సిప్స్‌తో కలిపి తారువేయాల్సి ఉండగా పనులు నేటికీ పూర్తి కాలేదు. భీమవరం మండలంలోని 31 పనులకుగానూ ఇప్పటి వరకు కేవలం 5 రోడు పనులు మాత్రమే పూర్తికాగా 16 పనులు జరుగుతుండగా మరొక 10 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వీరవాసరం మండలంలోని బాలేపల్లి-దూసనపూడి రహదారికి రూ. 22 లక్షలు, తోలేరు రోడ్డుకు రూ. 14 లక్షలు, కమతాలపల్లి-బేతపూడి రోడ్డుకు రూ. 35 లక్షలు, నవుడూరు కొణితివాడ రోడ్డుకు రూ. 20 లక్షలు, వీరవాసరం -పెర్కిపాలెం రోడ్డుకు రూ. 7 లక్షలు మంజూరు చేశారు. ఈ పనుల్లో గోతులు పూడ్చడం పూర్తి చేసినా తారుతోకలిపిన చిప్స్ వేయాల్సి ఉంది. కొణితివాడ నుంచి మగుడుపోలవరం లంక గ్రామం వరకు రోడ్డు గోతులు పూడ్చడానికి నిధులు లేకపోవడంతో పనులు నిలిచిపోయాయి.

జాతీయ రహదారిదీ అదే దుస్థితి

భీమవరం నుంచి పాలకొల్లు వైపు వెళ్లే జాతీయ రహదారికి కొన్ని చోట్ల రోడ్డును పూర్తిగా నిర్మించగా మరికొన్నిచోట్ల మరమ్మతులు చేశారు. అయితే రోడ్డు పనుల్లో నాణ్యత లేకపోవడంతో వేసిన నెలరోజుల్లోనే రాళ్లు లేచి గుంతలు పడ్డాయి. దీనికి మరలా ప్యాచ్‌వర్క్స్ చేసినప్పటికీ అనేకచోట్ల చిద్రమవుతుండడంతో రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రశ్నార్థకంగా మొత్తం మీద రోడ్డు నిర్మాణం, నాణ్యతపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాలి

ఆకివీడు: క్రీడా పోటీలో ఉత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించడం ద్వారా ఉన్నత శిఖరాల్ని అధిరోహించవచ్చునని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు అంబటి రమేష్ చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో డీవైఎఫ్‌ఐ సంక్రాంతి యువజనోత్సవాల్లో క్రికెట్ పోటీలను బుధవారం ఎస్సై హనుమంతు నాగరాజు ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రమేష్ మాట్లాడుతూ గత 42 ఏళ్లుగా డీవైఎఫ్‌ఐ సంక్రాంతి యువజనోత్సవాల్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ ఆహ్వాన కమిటీ కార్యదర్శి డోకల రవితేజ, బి.వర్మ, సందక సూరిబాబు, బీ.రాంబాబు, పెంకి అప్పారావు, తవిటి నాయుడు, ప్రిన్సిపాల్ కె.సుజాత పాల్గొన్నారు.


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

సంక్షిప్తంగా..

● పెదఅమిరంలో న్యాయ విజ్ఞాన సదస్సు

కాళ్ల: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి యోహాన్ తెలిపారు. భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పెద అమిరంలో డ్వాక్రా భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో పలు అంశాల్లో అవగాహన కల్పించారు. ప్యానల్ న్యాయవాదులు సుధీర్, భవాని, రవికిరణ్ పాల్గొన్నారు.

● కుట్టు మెషీన్ల పంపిణీ

భీమవరం: పేద మహిళలు స్వయంశక్తితో ఆర్థికంగా నిలబడేందుకు రాజ్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్నట్లు దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర కుమార్ అన్నారు. బుధవారం భీమవరం పట్టణంలోని 10వ వార్డు చినరంగనిపాలెంపుంతలో 40 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఏలేటి న్యూటన్, గిద్దా శ్రీనివాస్‌నాయుడు, తోరం రాజు పాల్గొన్నారు.

● జంతు సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుల ఎంపిక

భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లా జంతు సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులుగా శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్, సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గోరక్ష అధ్యక్షుడు సుంకర దాసు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఈ పదవి రావడానికి సిఫార్సు చేసిన భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు.

'బరి'తెగింపు

ఉండి: మండలంలోని మహదేవపట్నంలో బుధవారం రాత్రి భారీ ఎత్తున కోడిపందేలు జరిగాయి. వందల సంఖ్యలో కార్లు, మోటార్ సైకిళ్లపై పందెగాళ్లు జిల్లా నలుమూలల నుంచి వచ్చారు. ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి మరీ సమాచారం అందించి పందేలు నిర్వహిస్తున్నారు. ఇంత బహిరంగంగా పందాలు జరగుతున్నా పోలీసులు, అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. దీనిపై పోలీసులను సమాచారం అడిగితే అసలు ఎలాంటి కేసు లేదని వారు చెప్పడం గమనార్హం.

● రీ సర్వేకు సహకరించండి

ఉండి: రీ సర్వేపై ప్రజలంతా అవగాహన చేసుకుని సహకరించాలని తహసీల్దార్ కె.నాగార్జున అన్నారు. బుధవారం మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలో రీ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. మున్నలూరి సువర్ణలక్ష్మి, ముగ్గళ్ళ సత్యనారాయణ, సూరవరపు వెంకటాచార్యులు, కవురు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

● శ్రీదేవిట్రస్టు సేవలు అభినందనీయం

కాళ్ల: దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు సేవలు అభినందనీయమని ఆకివీడు సీఐ జగదీశ్వరావు అన్నారు. కాళ్ల పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న 30 మంది సిబ్బందికి శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు అధినేత దాట్ల వెంకటరామరాజు ఆధ్వర్యంలో పోలీసులకు యూనిఫాం దుస్తులను బుధవారం పంపిణీ చేశారు.

● కాళ్లకూరులో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

కాళ్ల: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కాళ్లకూరులో వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్ బుధవారం చెప్పారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

● ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

భీమవరం(ప్రకాశం చౌక్): జువ్వలపాలెం రోడ్డులోని దంతులూరి జగన్నాథ రాజు (కోపల్లె వారి) సత్రం అనుబంధ సంస్థ శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి పర్వదినానికి ఏర్పాట్లు పూర్తి చేశామని వంశపారంపర్య ధర్మకర్త మంతెన రామ్‌కుమార్ రాజు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజాము 3.30 దర్శనం ప్రారంభమవుతుందని తెలిపారు భీమవరం హౌసింగ్ బోర్డ్ కాలనీ శ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం జరిగే ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయంలో దేవతా మూర్తుల విగ్రహములు అన్నిటికీ నూతన పట్టు వస్త్రములను ఇందుకూరి వెంకటరాజు-సరస్వతి దంపతులు కైంకర్యం చేశారు.

● ఆకట్టుకున్న మాండలిన్ వాయిద్య కచేరి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 106వ త్యాగరాజ ఆరాధనోత్సవాలలో భాగంగా మూడో రోజు ప్రపంచ ప్రఖ్యాత మాండలిన్ వాయిద్య విద్వాంసుడు యు.రాజేష్ (చెన్నై) చేసి మాండలిన్ కచేరి ఆకట్టుకుంది. ముందుగా నాట్యాచారిణి భానుశ్రీ చేసిన భరతనాట్యం అందరినీ ఆకట్టుకుంది. భానుశ్రీకి డా గంధం విశ్వేశ్వర రావు రూ 10 వేలు నగదు బహుమతిని విద్వాంసులు రాజేష్ చేతుల మీదుగా అందించారు.

జిల్లా కేంద్రం భీమవరం


సోమారామం ఆలయ ప్రాంగణం


- ఆక్వా సిరులు.. సంక్రాంతి బరులు
- విద్య, వైద్యం, వ్యాపార కేంద్రంగా అభివృద్ధి

సాక్షి, భీమవరం: పంచారామాల్లోని సోమారామం, మావూళ్లమ్మ వారి ఆలయాలురాష్ట్రంలో అతిపెద్ద చర్చి అయిన రూపాంతర దేవాలయం, పెద్ద మసీదు, ఇస్కాన్ మందిరం ఆధ్యాత్మిక సుగంధాలతో చుట్టూ పచ్చని పంట పొలాలు, ఏపుగా పెరిగిన కొబ్బరిచెట్లు, నిండు కుండల్లా ఆక్వా చెరువులతో ఆహ్లాకరమైన వాతావరణం భీమవరం పట్టణం సొంతం. సంక్రాంతి బరులకు, తెలుగింటి సంప్రదాయాలకు పెట్టింది పేరుగా విద్య, వైద్యం, వ్యాపార రంగాల్లో పురోభివృద్ధితో వేలమందికి ఉపాధి కల్పిస్తున్న ఈ పట్టణానికి జిల్లా కేంద్రం హోదా మరిన్ని హంగులు అద్దింది. 39 వార్డులతో విస్తరించి ఉన్న పట్టణ జనాభా 1.6 లక్షలుగా ఉంది. ఆక్వా, అనుబంధ పరిశ్రమలతో ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా జిల్లాలకు భీమవరం వ్యాపార కేంద్రంగా ఉంది. ఆక్వా ఫీడ్, మెడిసిన్స్, ప్రాసెసింగ్ యూనిట్లు, చెరువుల్లో వినియోగించే సామగ్రి తయారీ కంపెనీల్లో రాష్ట్రానికి చెందిన వారితో పాటు ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ఎన్నో వేల మంది ఉపాధి పొందుతున్నారు.

చరిత్రలో ఎంతో ప్రత్యేకత

భీమవరం పట్టణానికి ఒక ప్రత్యేకత ఉంది. వేంగిని పరిపాలించిన కుశోత్తుంగ చాళుక్య కుమారులు ఇక్కడ పాలకులుగా నియమితులయ్యారని వారిలో ఒకరైన చాళుక్య భీముడు ఆధ్వర్యంలో క్రీస్తు శకం 890 ప్రాంతంలో భీమేశ్వర ఆలయాన్ని నిర్మించారని చరిత్రకారులు చెబుతున్నారు. చాళుక్య భీముని పాలనతో ముందుగా భీమాపురం తదనంతర జనం వాడుకలో భీమవరంగా మార్పు చెందింది. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా 1817లో భీమవరం తాలూకా కేంద్రంగా ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమంలో బ్రిటీష్ పాలకుల తుపాకీ గుళ్లకు ఎదురొడ్డి ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, పన్నుల సహాయ నిరాకరణ, ఉప్పు సత్యాగ్రహం ఉద్యమాల చరిత్ర కలిగిన భీమవరం పట్టణాన్ని గాంధీజీ రెండవ బార్డోలీగా పేర్కొన్నారు.


భీమవరం కలెక్టరేట్


మావూళ్లమ్మ వారు

జిల్లా కేంద్రంగా సుపరిచితం

పాలనను ప్రజలకు మరింత చేరువ చేస్తూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన జిల్లాల పునర్విభజనలో భీమవరం కేంద్రంగా పశ్చిమగోదావరి జిల్లా ఆవిర్భవించింది. నరసాపురం పార్లమెంట్ పరిధిలోని ఏ నియోజకవర్గం నుంచి అయినా కేవలం 25 కిలోమీటర్లు దూరంలోనే భీమవరంలోని కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, ఇతర శాఖల కార్యాలయాలు ఉన్నాయి. తణుకు నుంచి 23 కి.మీ, తాడేపల్లిగూడెం నుంచి 25 కి.మీ, ఆచంట నుంచి 25 కి.మీ, నర్సాపురం నుంచి 25 కి.మీ, పాలకొల్లు నుంచి 18 కి.మీ, ఉండి నుంచి కేవలం 7 కి.మీ దూరంలోనే కలెక్టరేట్ ఉంది. కేవలం గంటలోపే జిల్లా కేంద్రానికి చేరుకునే సౌలభ్యం కలిగింది.

విద్య, వైద్య రంగాల్లో ప్రత్యేక ముద్ర

అత్యవసర, సాధారణ వైద్యం కోసం నగరాలకు పరుగులు తీయాల్సిన అవసరం లేకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక వసతులతో శివరంజని హాస్పటల్స్, సంతాన సమస్యలను పరిష్కరిచే గిఫ్ట్ ఫెర్టిలిటి హాస్పటల్, మహిళల ప్రసూతి, గర్భకోశ సమస్యలు, దీర్ఘకాలిక నొప్పులను పరిష్కారం చూపుతూ శ్రీనందస్ హాస్పటల్స్, సనాతన ఆయుర్వేద వైద్యాన్ని కొనసాగిస్తున్న శ్రీసాయి ఆయుర్వేద హాస్పటల్ వంటి ప్రముఖ ఆస్పత్రులు పట్టణంలో ఎన్నో ఉన్నాయి. ఎప్పటికప్పుడు వైద్యరంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుంటూ ఇక్కడి వైద్యులు ప్రజలు నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్నారు. ఎల్‌కేజీ నుంచి ఇంజినీరింగ్ విద్య వరకు పేరొందిన విద్యాసంస్థలతో భీమవరం దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. విద్యార్థుల ఉన్నతికి బాటలు వేస్తూ ఏటా ఉత్తమ ఫలితాలు సాధించే ఆదిత్య ఇంగ్లిష్ మీడియం వంటి స్కూల్స్‌కు పట్టణంలో కొదవలేదు. రైల్వే, ఎస్‌ఎస్‌సీ తదితర ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసే రైజ్ ఇనిస్టిట్యూట్ వంటి కోచింగ్ సెంటర్లు, ఏఎన్‌ఎం, జీఎన్‌ఎమ్, బీఎస్సీ నర్సింగ్ తదితర కోర్సులను అందించే శ్రీగాయత్రి పారామెడికల్ కాలేజీలు ఉన్నాయి.

రుచుల్లో ప్రత్యేక బ్రాండ్

భీమవరం రుచులకు ప్రత్యేక ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. బ్రాండెడ్ రెస్టారెంట్ల బ్రాంచీలు ఉండగా, సాంప్రదాయ సీ ఫుడ్ వంటకాలు, దూపుడుపోతు, చికెన్, మటన్, ఫిష్, ప్రాన్ బిర్యానీలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న స్థానిక రెస్టారెంట్లు ఎన్నో ఉన్నాయి. సంపన్న వర్గాల కోసం దేశీయ, విదేశీ వంటకాలను వండి వార్చే స్టార్ హోటల్స్‌కు కొదవలేదు. అలాగే మెట్రో నగరాలకు ధీటుగా క్లాత్ రెడీమేడ్, జ్యూయలరీ, కార్లు, మోటారు బైక్‌లు తదితర ప్రముఖ బ్రాండెడ్ కంపెనీలకు చెందిన షోరూమ్‌లు పట్టణంలో ఎక్కడ చూసినా కనిపిస్తాయి.

రోగులకు నాణ్యమైన వైద్యసేవలు



వైద్యపరంగా భీమవరం ఎంతో అభివృద్ధి చెందింది. నగరాలకు ధీటుగా ఆధునాతన వైద్యం అందిస్తున్నారు. మా గిఫ్ట్ ఫెర్టిలిటీ హాస్పటల్‌లోని న్యూరో విభాగంలో మెదడు, వెన్నుపాము, నరాలకు సంబంధిచిన నాణ్యమైన వైద్యసేవలను రోగులకు అందిస్తున్నాం.

– జీఎస్ కుమార్, ప్రముఖ న్యూరో వైద్యులు, భీమవరం

మా వంటకాలు రుచి చూడాల్సిందే



మా వంటకాలకు దేశవ్యాప్తంగా పేరుంది. ఎక్కడకు వెళ్లిన భీమవరం రుచులంటూ ప్రత్యేకంగా హోటళ్లు కనిపిస్తుంటాయి. భీమవరంలోని మా వెంపరాజు గారి వంటిల్లులోని దూపుడుపోతు, నాటు కోడి దూపుడు బిర్యానీల కోసం విజయవాడ, రాజమహేంద్రవరం, ఇతర దూర ప్రాంతాల నుంచి వస్తుంటారు. తమ బంధువుల కోసం ప్రత్యేకంగా తీసుకువెళ్తుంటారు.

– మంతెన కృష్ణంరాజు, వెంపరాజు గారి వంటిల్లు యజమాని

ఆదిత్య స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

భీమవరం: పట్టణంలోని ఆదిత్య స్కూల్లో బుధవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి గొబ్బెమ్మల పాటలు పాడుతూ ఎంతోగానో అలరించారు. భావితరాలకు పండుగల విశిష్టతను తెలియచేసే విధంగా ఏర్పాటు చేసిన సంక్రాంతి వేడుకల్లో విద్యార్థులు గంగిరెద్దులు ఆడించే వారి వేషధారణలతో పాటు పిట్టల దొర, హరిదాసు వంటి వేషాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఆదిత్య కృష్ణంరాజు, ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్, బి.యుగసుధ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


భీమవరం ఆదిత్య స్కూల్ సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం